


మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఆ రోజు కాలేజీలో అంతా హడావిడిగా వున్నారు. కారణం, ఆ రోజు కాలేజ్ డే. ఆ సందర్భంగా ఒక ముఖ్య అతిధి విచ్చేస్తున్నాడు. అతనిపేరు సార్వభౌమారావు అతన్ని అతిధిగా ఆహ్వానించడానికి కారణం, కేవలం అతను రచయిత అయివుండటమే

కార్యక్రమం మొదలయింది. ముందర ప్రిన్సిపాల్ సార్వభౌమారావుని వేదికమీదికి ఆహ్వానించి, ఓ అయిదు నిముషాలు తను మాట్లాడి, సార్వభౌమారావుని ఆ తర్వాత మాట్లాడమని కోరి కూర్చున్నాడు.

సార్వభౌమారావుకి అదే మొదటిసారి కాదు స్టేజీమీద వందలమంది ముందు పూలదండ వేయించుకోవటం, మాట్లాడటం. అందుకని తత్తర పడకుండా ప్రసంగించసాగాడు.

తను పది సంవత్సరాలకు పూర్వం ఇదే కాలేజీలో విద్యార్థిననీ, తనకీ గౌరవం ఇచ్చినందుకు అందరికీ కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాననీ చెప్పి, తను ఎన్నుకొన్న అంశం ధారాళంగా ప్రసంగించసాగాడు.

ఆ అంశం 'మంచి కథ వ్రాయటం ఎలా ?'

కథలోని భాగాలు - అంటే శిల్పం, శైలి ఎత్తుగడ, పాత్రలు, ముగింపు, పాత్ర పోషణలాంటి అనేకవాటిమీద, తన అనుభవంలోని విషయాలని అక్కడక్కడ వుదహరిస్తూ, ముప్పావుగంటపైగా శ్రోతలందరినీ అంగుళం అయినా కదలకుండా కూర్చోపెట్టేసాడు సార్వభౌమారావు. ఆ ఉపన్యాసం విన్నాక చాలామందికి కథ వ్రాయాలన్న ఇన్‌స్పిరేషన్ వచ్చింది. ఇకముందు కథ చదివితే అది మంచికథ అవునా, కాదా అన్న సంగతి తెల్సుకోవచ్చనుకున్నారు ఒకరిద్దరు.

తమ అభిమాన రచయితని కళ్లారా చూసుకొనగలిగాం అన్న తృప్తి చాలా మంది పాఠకులకి కలిగింది. దాదాపు రెండు వందల పాతిక కథలుదాకా సార్వభౌమారావుని ప్రమరితం అయాయి. రెండు సంపుటాలు కూడా వెలువడ్డాయి.

ప్రోగ్రాం పూర్తయాక సార్వభౌమారావుని ఇంటిదగ్గర టాక్సీలో దింపారు. ఇంట్లోకి రాగానే పూలదండ తను కథలు వ్రాసుకునే టేబిల్‌మీద పడేసాడు. కొద్దిగా గర్వంగా. అతని భార్యకి మొదటి పూలదండ చూసినప్పుడు కలిగిన థ్రిల్ ఇప్పుడంతగా లేదు కాబట్టి. "సభ బాగా జరిగిందా ? భోజనం వడ్డించమంటారా ?" అన్నది మామూలుగానే.

"వడ్డించు" అని సార్వభౌమారావు తనకొచ్చిన వుత్తరాలని నాలిగింటిని అందుకుని చదవసాగాడు. వాటిల్లో ఒకటి పోస్టుకార్డు. దానిమీద ఇలా వుంది.

అయ్యా, అమ్మా,

మీ రచన 'ఎవరికెవరు' ప్రమరణకి తీసుకోలేదని తెలుపటానికి చింతిస్తున్నాము.

వ్రాతప్రతితో తగినన్ని తపాలా బిళ్లలు అతికించిన చిరునామాగల కవరు జతపరచి వున్నట్లయితే, అది మీకు త్రిప్పి పంపబడుతుంది.

దీని విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగే అవకాశం లేదని గుర్తించగోరుతాము.

చిత్తగించవలెను.
సంపాదకుడు.

మరొక కవరులో ఆ కథ 'ఎవరి కెవరు' త్రిప్పిపంపబడటం గమనించాడు సార్వభౌమారావు. దీర్ఘంగా నిట్టూర్చాడు.

"అన్నం వడ్డించాను" అన్నకేక లోపల నుంచి వినపడగానే, "వస్తున్నాను" అని అరిచాడు బదులుగా.

"మంచి కథ వ్రాయటం ఎలా ?" అన్న అంశం గురించి చెప్పాను కాని, అన్నీ మంచి కథలే వ్రాసే రచయిత ఈ లోకంలో వుండటం అరుదని చెప్పటం మరిచాను" అనుకున్నాడు సార్వభౌమారావు అన్నం కలుపుకుంటూ.